క్లుప్తంగా

తాగునీటి సరఫరాకు చర్యలు

- మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: పట్టణంలో పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన కార్యాలయంలో విలేకరుతో మాట్లాడిన ఆయన గ్రామదేవతల పండగ నేపథ్యంలో తోటపల్లి రిజర్వాయరు నుంచి నీటి సరఫరా జరిగేలా చూస్తున్నామన్నారు. పండగ జరిగే మూడు రోజుల్లో తాగునీటి ఒక్కట్లు లేకుండా శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయనున్నామన్నారు. పంపుహౌస్ వద్ద విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూస్తున్నామన్నారు. పట్టణ పారిశుద్ధ్యానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు.

ఆర్‌బీకేల్లోనే రబీ ధాన్యం కొనుగోలు

సీతానగరం: మండలంలోని అన్ని గ్రామ ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం)ల్లోనూ రబీ ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని ఏఓ ఎస్. అవినాష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే పంట కోత పూర్తి చేసిన రైతులు ఆర్‌బీకేల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించుకోవచ్చన్నారు.

ప్రారంభానికి ప్రభుత్వ భవనాలు సిద్ధం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గాదెలవలస సచివాలయం

సీతానగరం: మండలంలోని గాదెలవలస గ్రామంలో కొత్తగా నిర్మించిన సచివాలయ, రైతు భరోసా, వెల్‌నెస్ సెంటర్ భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఆదివారం వీటిని పరిశీలించిన సర్పంచ్ బి.అన్నపూర్ణమ్మ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జగన్‌మోహన్ మాట్లాడుతూ త్వరలోనే ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా ఈ భవనాలను ప్రారంభించేలా సన్నాహాలు చేస్తున్నామన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ భవన నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



మెయిన్ రోడ్డులో కూలిన చెట్టు కొమ్మ

సాలూరు: మండలంలోని పలుచోట్ల ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మధ్యాహ్నం అకస్మాత్తుగా వాతావరణం మారిపోయి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అంతకుముందు వీచిన భారీ గాలుల ధాటికి పట్టణంలోని మెయిన్‌రోడ్డు, దుగ్గిసాగరం జంక్షన్, తోటవీధిలోని చెట్లు విరిగిపడ్డాయి. దీంతో అటువైపుగా వెళ్లే వాహనదారులు, పాదచారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

మజ్జి గౌరమ్మ సంబరం



ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

భామిని: మండలంలోని బిల్లుమడలో వెలసిన మజ్జి గౌరమ్మ సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ముర్రాటలు సమర్పించారు. పసుపు, కుంకుమతో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామదేవత ఉత్సవాల సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది.

ఉత్సాహంగా కేరమ్స్ పోటీలు



కేరమ్స్ ఆడుతున్న విద్యార్థులు

భామిని: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం విద్యార్థులకు క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి గ్రంథాలయ అధికారి ఎ.సునీత బహుమతులు అందజేశారు. అలాగే ఆంగ్ల పదాలు, వాటి స్పెల్లింగులను విద్యార్థులతో రాయించారు.

అర్హతే ప్రామాణికం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెదబోగిలి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సీతానగరం, రజక, కుమ్మరి, దేవాంగుల, సుంకరి, సాలావారి వీధుల్లో ఆదివారం పర్యటించిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, ప్రతీ ఇంటికి లబ్ధి చేకూరేలా పథకాలు అమలు చేస్తోందన్నారు. అవసరమైన చోట అభివృద్ధి పనులు మంజూరు చేస్తూ త్వరితగతిన వాటిని పూర్తి చేస్తోందన్నారు. సీతానగరం, పెదబోగిలి, బుడ్డిపేట, అప్పయ్యపేట గ్రామాల్లో కొన్ని రూ.కోట్లతో జగనన్న లేఅవుట్‌లు వేసి, నిరుపేదలకు పక్కా ఇళ్లు ఇవ్వడం జరిగిందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులకే పథకాలు సక్రమంగా చేరేలా ప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. ప్రజల బాగోగుల కోసం అహర్నిశలు పాటుపడుతున్న సీఎం జగనన్నకు మనమంతా అండగా నిలవాలన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, ఆర్య వైశ్య సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ ఎస్.కూర్మారావు, వెలుగు ఏపీఎం ఆర్.శ్రీరాములు, సచివాలయ కన్వీనర్ ఎస్.రమేష్, ఎంపీటీసీలు ఎస్. గౌరి, బి.కుసుమ, పార్టీ నాయకులు పి.పైడిపినాయుడు, ఎం.వెంకటరమణ, పి. ఈశ్వరనారాయణ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు డిప్యూటీ సీఎం అభినందనలు



కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: జాతీయ స్థాయిలో జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయడంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్, జిల్లా అధికార యంత్రాంగం కృషిని ప్రశంసిస్తూ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర వారికి అభినందనలు తెలిపారు. ఆదివారం కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఆయన మౌలిక సదుపాయాల కల్పనలో పార్వతీపురం మన్యం జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చినట్లు తీర్చిదిద్దిన తీరు అద్భుతమన్నారు. ఇదే స్ఫూర్తితో ముున్ముందు కూడా పనిచేసి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.

ఘనంగా ఉయ్యాల కంబాల ఉత్సవం



ఉయ్యాల కంబాల ఉత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు



ఆకట్టుకున్న మహిళల కోలాటం

రాజాం సిటీ: పెనుబాక గ్రామంలో అసిరితల్లి పండగ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉయ్యాల కంబాల ఉత్సవం నిర్వహించారు. గత వారం రోజులుగా చేపడుతున్న గ్రామదేవత పండగ ఆఖరు దశకు చేరుకోవడంతో గ్రామమంతా కోలాహలంగా మారింది. మహిళల కోలాటాల నడుమ గ్రామస్తులంతా ముర్రాటలతో ఊరేగింపు చేపట్టారు. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా అంతా ఈ ఉత్సవంలో పాల్గొని సందడి చేశారు.

అవగాహన ర్యాలీ



రాజాం: ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

రాజాం: పట్టణంలో ప్రధాన రహదారిపై పలువార్డు సచివాలయాలకు చెందిన ఆరోగ్య కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ రుతుస్రావ అవగాహన దినోత్సవం సందర్భంగా ఈ ర్యాలీ నిర్వహించినట్లు అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్యాధికారులు డాక్టర్ అనూష, డాక్టర్ రోస్నారాలు తెలిపారు. కౌమారదశలో శరీరంలో కలిగే మార్పులు, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెప్మా టీఎంసీ రత్నం, మహిళా సంఘాల సభ్యులు, మెప్మా ఆర్‌పీలు, సీఓలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

తెర్లాం: కిశోర బాలికలు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి దీక్షితారాణి, ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి అన్నారు. తెర్లాంలో ప్రపంప మహిళా నెలసరి పరిశుభ్రత అవగాహన దినోత్సం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీస్ తులసి, తెర్లాం విలేజ్ క్లినిక్ ఎంఎల్‌హెచ్‌పీ వై.శ్రీదేవి, ఏఎన్‌ఎం ప్రభావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, కిశోర్ బాలికలు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



దుర్గమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

పార్వతీపురం టౌన్: స్థానిక పట్టణంలో గ్రామదేవతల పండగ నేపథ్యంలో ఆదివారం దుర్గమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఇప్పలపోలమ్మ, ఎర్రకంచమ్మ, బంగారమ్మ ఆలయాలకు భక్తులు పోటెత్తి, అమ్మవార్లకు చల్లదనం చేశారు. పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. పండగలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పోలీసుల తనిఖీలు



డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

పాలకొండ రూరల్: పాలకొండ-సీతంపేట రహదారిలో ఎస్సై బి.శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణ శివారు ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని వస్తున్న ఆరోపణలపై పోలీసులు స్పందించారు. తనిఖీలు చేపట్టి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై కేసులు నమోదు చేశారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేశారు.

కోటదుర్గమ్మ ప్రత్యేక సంబరాలు



ఘటాలతో కోటదుర్గమ్మ ఆలయానికి వెళ్తున్న భక్తులు

పాలకొండ రూరల్: మండుటెండను లెక్కచేయకుండా భక్తులు కోటదుర్గమ్మ సేవలో నిమగ్నమయ్యారు. ఆదివారం అమ్మవారికి మొక్కులు చెల్లించి, ప్రత్యేక సంబరాలు నిర్వహించారు. ముర్రాటలు, ఘటాలను తలదాల్చి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద శర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, అర్చనలు చేపట్టారు. పట్టణంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

వైఎస్సార్‌సీపీతోనే గిరిజనాభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



టి.కె.జమ్ము గిరిజన గ్రామంలో మహిళకు సంక్షేమ లబ్ధిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం/జియ్యమ్మవలస: గిరిజనాభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. జియ్యమ్మవలస మండలం టీకే జమ్ము, గోర్లి, గోర్లివలస, దోడ్డి, పాండ్రసింగి గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లోని ప్రతీ గడపకూ వెళ్లి నాలుగేళ్లలో వారికి అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల కోసం కాళ్లరిగేలా తిరిగిని అందేవి కాదని, అర్హులకు కాదని టీడీపీ కార్యకర్తలకు మాత్రమే పథకాలు అందేవని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా, కుల, మత, వర్గ బేధాలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అవినీతికి తావులేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే సంక్షేమ పథకాల నిధులు జమ అవుతున్నాయన్నారు. అన్ని వర్గాల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారన్నారు. కురుపాం నియోజకవర్గ కేంద్రంలో రూ.150 కోట్లతో సుమారు 105 ఎకరాల్లో గిరిజన ఇంజినీరింగ్ కళాశాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం గిరిజనులకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. ప్రజలు టీడీపీ పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకోవాలని కోరారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యక్రమంలో జెడ్పీటీసీ మూడడ్ల శశికళ, వైస్ ఎంపీపీ సంపత్, ఏపీఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ మూడడ్ల గౌరీశంకరరావు, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, మాజీ జెడ్పీటీసీ కద్రక బలరాం, వైఎస్సార్‌సీపీ నాయకుడు మరడాన కిశోర్, అల్లు ఈశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయండి

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు:

రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక పట్టణంలో సోమవారం చేపట్టే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర కోరారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అమరావతిలోని నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెంటు భూమి ఇస్తే, ఆ స్థలాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సమాధి స్థలంతో పోల్చడం దారుణమన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై కేవలం ఉనికి చాటుకునేందుకు విమర్శలు చేయడం తగదన్నారు. టీడీపీ, ఆ పార్టీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలు తిప్పికొట్టేలా చేపట్టే బైక్ ర్యాలీకి పార్టీ నాయకులు, కార్యకర్తలంతా తరలిరావాలని కోరారు.

పండగ వేళ అప్రమత్తంగా ఉండాలి

- సీఐ పి.వి.వి.ఎస్.ఎన్ కృష్ణారావు



మాట్లాడుతున్న సీఐ కృష్ణారావు

పార్వతీపురం టౌన్: పట్టణంలో ఆదివారం నుంచి ప్రారంభమైన గ్రామదేవతల పండగల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సీఐ పి.వి.వి.ఎస్.ఎన్ కృష్ణారావు సూచించారు. ఇప్పలపోలమ్మ, ఎర్రకంచమ్మ, బంగారమ్మ పండగలు మూడు రోజుల పాటు జరగనున్నాయని, ఈ సమయంలో దొంగలు వారి చేతివాటం చూపించే అవకాశం ఉందని తెలిపారు. పండగ స్థలాలతో పాటు దుకాణాలు, మార్కెట్లు, ఇతర రద్దీ ప్రదేశాల్లో జేబు దొంగల సంచారం ఎక్కువగా ఉంటుందని, డబ్బులు పోగొట్టుకోకుండా చూసుకోవాలన్నారు. ఈ మూడు రోజులు వ్యాపారులు తమ దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేయడం మంచిదన్నారు. ఈ నెల 30వ తేదీన సాయంత్రం 5 గంటలకు జరిగే సిరిమానోత్సవం దృష్ట్యా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూస్తున్నామన్నారు. బాబుజగ్జీవన్‌రామ్ కూడలి నుంచి పాతబస్టాండ్, రాయగడ కూడలి వరకు రాకపోకలు పూర్తిగా నిలిపివేస్తామన్నారు. పట్టణంలోకి రావాల్సిన వారు, కృష్ణపల్లికి వెళ్లాల్సిన వారు ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా బైపాస్ రోడ్డులో సౌందర్య థియేటర్ రోడ్డులో వెళ్లాల్సి ఉంటుందన్నారు. విజయగరం-ఒడిశా వెళ్లే వాహనాలు రామభద్రపురం వయా సాలూరు మీదుగా వెళ్లాలని, ఒడిశా నుంచి విజయనగరం వచ్చే వాహనాలను కొమరాడ మండలంలోని అర్తాం గ్రామం మీదుగా చంద్రంపేట, గోపాలపురం వయా బైపాస్ రోడ్డు మీదుగా మళ్లిస్తామన్నారు. ఈ నేపథ్యంలో వాహనదారులు, గ్రామస్తులు సహకరించాలన్నారు.

నాలుగేళ్ల పాలనను పండగలా చేద్దాం

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ/వీరఘట్టం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి సమప్రాధాన్యతనిస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి మంగళవారం నాటికి నాలుగేళ్లు పూర్తిచేసుకుని ఐదో వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రజలకు అభినందనలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం నివాసంలో ఆదివారం స్థానిక మీడియా ప్రతినిధులతో వారు మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహనరెడ్డి నాలుగేళ్ల పాలనను పండగలా చేద్దామని వైఎస్సార్‌సీపీ అభిమానులకు పిలుపునిచ్చారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఈ నాలుగేళ్ల పాలనలో 98 శాతం వరకు నెరవేర్చి ప్రజలకు ఆత్మబంధువైన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

30న పాలకొండలో రైతు దినోత్సవం

ఈనెల 30న పాలకొండ మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న స్థలంలో రైతు దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, జిల్లా కలెక్టర్ నిషాంత్‌కుమార్, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న రైతులందరూ ఈనెల 30న ఉదయం 9 గంటలకు పాలకొండలో నిర్వహించనున్న రైతు దినోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి లీలాప్రసాదరావు, కనపాక సూర్యప్రకాశరావు, యందవ మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఖోఖోలో తలపడుతున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: క్రమం తప్పకుండా యోగాసనాలు వేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం, ఏకాగ్రత పెరుగుతుందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు, యోగా శిక్షకుడు కె.జనార్దరావు అన్నారు. ఆదివారం స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. యోగాసనాలు వేయడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. అనంతరం గ్రంథాలయ ఇన్‌చార్జీ బి.గణేష్‌బాబు పొడుపు కథలపై పోటీలు నిర్వహించారు. పొడుపు కథలను విడమరిచే సమయంలో మెదడు చురుగ్గా పనిచేస్తుందన్నారు. అనంతరం చిన్నారులకు ఆటపాటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేత కొండవాడ క్రికెట్ జట్టుతో నిర్వాహకులు

భామిని: మండలంలోని వడ్డంగి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. కురుపాం మండలం కొండవాడ జట్టు, కిచ్చాడ జట్లు ఫైనల్స్‌లో తలపడగా.. కొండవాడ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు వైఎస్సార్‌సీపీ రైతు సంఘం అధ్యక్షుడు బోదెపు శ్రీనివాసరావు, పార్టీ కార్యదర్శి బోదెపు జగన్, సర్పంచ్ కొండగొర్రి ఉషారాణి చేతులమీదుగా ట్రోఫీ, నగదు బహుమతి అందజేశారు. విన్నర్స్‌కు రూ.15వేలు, రన్నర్స్‌కు రూ.10వేలు అందజేశారు.

ఆర్‌బీకేల్లోనే రబీ ధాన్యం కొనుగోలు

సీతానగరం: మండలంలోని అన్ని గ్రామ ఆర్‌బీకే(రైతు భరోసా కేంద్రం)ల్లోనూ రబీ ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని ఏఓ ఎస్.అవినాష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇప్పటికే పంట కోత పూర్తి చేసిన రైతులు ఆర్‌బీకేల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించుకోవచ్చన్నారు.